

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

3

**సావిత్రికి** చటుక్కున మెలుకువ వచ్చింది.

పక్కింటి గోడగడియారం కొట్టే గంటవల్ల.

లెక్కపెట్టింది. నాలుగు.

సావిత్రికి నిద్రమత్తు వదిలేకొద్దీ గత పదిరోజులుగా తను అనుభవిస్తున్న బాధ నిశ్శబ్దంగా ఆమె మనసునిండా మళ్ళీ పేరుకోసాగింది.

కళ్ళుమూసుకుని మళ్ళీ నిద్రకోసం ప్రయత్నించింది కానీ ప్రయత్నిస్తే వచ్చేది నిద్రకాదని అర్థమైంది. దూరం. వియోగం.

పక్కకి తిరిగి హాయిగా, నిశ్చింతగా నిద్రపోతున్న తన కొడుకువంక చూసింది. అమాయకంగా వున్న ఆ పసివాడి నుదుటిమీద జుట్టుని పైకి తోసి అక్కడ మృదువుగా ముద్దుపెట్టుకుంది. రాత్రి నిద్రపోయే ముందు రాజేష్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"అమ్మా, ఈ రాత్రి నిద్రపోను. ఒకవేళ నేను నిద్రపోయినా మర్చిపోకుండా లేపు. వెధవ నిద్ర రోజూ ఉంటుందిగా. మళ్ళీ నిన్ను ఎన్ని రోజులకి చూస్తానో?"

"కన్నా, కన్నా!" కొడుకు చేతిని నెమ్మదిగా కదుపుతూ లేపింది సావిత్రి. రాజేష్‌కి వెంటనే మెలుకువ వచ్చేసింది.

"గుడ్ మార్నింగ్. టైమయిందామ్మా?" అడిగాడు ఆవలిస్తూ.

"ఇంకో గంటన్నర."

తల్లి చేతిని తన చేత్తో పట్టుకున్నాడు రాజేష్ బేలగా.

"వెళ్ళటం తప్పదామ్మా?" అడిగాడు.

"తప్పదు కన్నా."

"నువ్వు త్వరగా వచ్చేస్తావుగా?"

"వచ్చేస్తాను."

ఇద్దరూ మవునంగా ఉండిపోయారు. సావిత్రి తన కొడుకు జుట్టులోకి చేతివేళ్ళు పోనిచ్చి దువ్వుతూండిపోయింది.

"నే చెప్పినవన్నీ గుర్తున్నాయిగా?" అడిగింది సావిత్రి కాస్సేపాగి.

"ఓ!"

"తాతయ్య దగ్గర అల్లరి చెయ్యకూడదు. చేస్తే కోపం వస్తుంది."

"చెయ్యను."

"అన్నం నువ్వే కలుపుకుని తినాలి. మీ పిన్నిని నోట్లో పెట్టమని మారాం చేయకూడదు."

"అసలు పిన్ని పెట్టినా నేను అలా తిననుగా. నువ్వు పెడితేనే నాకిష్టం."

"రాత్రి ఒంటరిగా పడుకున్నప్పుడు భయం వేస్తే ఏం చేస్తావ్?"

"శ్రీరామ శ్రీరామ శ్రీరామ శ్రీరామ అనుకుంటాను."

"అలా అనుకుంటే ఏమవుతుంది?"

"రాముడు చక్రం అడ్డం వేసి భయం పోగొడతాడు."

"ఉదయం నిద్రలేవగానే ఏమంటావ్?"

"గుడ్ మార్నింగ్ తాతయ్యా! గుడ్ మార్నింగ్ నాన్నగారూ! గుడ్ మార్నింగ్ పిన్నీ"

"నువ్వు విడిచిన బట్టలు ఏం చేస్తావ్?"

"బాత్‌రూం ఎవరూ ఉపయోగించని సమయంలో సబ్బుతో ఉతుక్కుంటాను."

"తర్వాత?"

"తర్వాత?"

"దణ్ణెం మీద ఆరేసుకోవాలి."

"అవునవును మర్చేపోయాను. చూశావా. దణ్ణెం మీద ఆరేసుకుంటాను. ఆరగానే వాటిని మడిచి నా పెట్టెలో పెట్టుకుంటాను. నా కంచం నేనే శుభ్రంగా తోమి తుడిచి పెడతాను. నా పక్క నేనే వేసుకుంటాను. ఉదయం నిద్రలేచాక పక్కని మడుచుకుంటాను. నా పళ్ళు నేనే తోముకుంటాను. ఇంకా..."

సావిత్రి ఇక దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. రాజేష్ తలని తన గుండెలమీదకి లాక్కుని "కన్నా, నా కన్నా, నా కన్నా" అంటూ బావురుమంది.

అంటువ్యాధిలా రాజేష్‌కి కూడా అంటుకుంది ఆ ఏడుపు.

"వద్దమ్మా నేను వెళ్ళను. నిన్ను వదిలి నేనెక్కడికీ వెళ్ళను. అసలెక్కడికీ వెళ్ళొద్దు మనం కలసి చచ్చిపోదాం అమ్మా"

సావిత్రికి వెంటనే తను చేసిన తప్పు తెలిసొచ్చింది. ఛ ధైర్యం చెప్పాల్సింది పోయి ఈ పసివాడిముందు ఏమిటిలా తను? తన బుద్ధి ఏమైపోయింది?

సావిత్రి చేతికి రాజేష్ పడుకున్న పట్టా చల్లగా తగిలింది.

"ఏడవకు కన్నా! ఇలా పక్కలో పాస్ పోయడం తప్పని ఎన్నిసార్లు చెప్పాను? అక్కడ మీ తాతయ్య ఇంట్లో కూడా ఇలా చేస్తే ఎలా?"

"నేను పొయ్యలేదమ్మా"

"మరయితే నేను పోసానా?"

రాజేష్ గలగలా నవ్వాడు.

"ఛీ!" అన్నాడు.

"అవసరం వస్తే రాత్రి లేచి బాత్‌రూంకి వెళ్ళాలి."

"అలాగే."

"ప్రామిస్?"

రాజేష్ తల్లి చేతిలో చెయ్యివేసి, వంగి తల్లి చెవిలో చెప్పాడు రహస్యంగా. వెంటనే చెంపమీద ముద్దు పెట్టుకున్నాడు.

"ప్రామిస్."

"ఇంక లేద్దామా?"

"లేద్దాం."

"చూపించు.. చూద్దాం, ఎలా స్నానం చేస్తావో?"

కొడుకు స్నానం చేస్తూంటే చూస్తూ "అలాకాదు, ఇలా" అని సూచనలు చేసింది.

"అమ్మా! కళ్ళల్లోకి సబ్బునురగపోకుండా ఎలా రుద్దుకోవడం?" అడిగాడు రాజేష్.

"కళ్ళు మూసుకునే వుండాలి."

"కళ్ళు తెరవాలనిపిస్తుందెందుకు?"

"అలాంటప్పుడు 'శ్రీరామ శ్రీరామ శ్రీరామ శ్రీ రామ' అనుకుంటే కళ్ళు తెరవాలనిపించదు."

"శ్రీరామ శ్రీరామ శ్రీరామ శ్రీరామ శ్రీరామ శ్రీరామ ...నిజమేనమ్మా నువ్వు చెప్పింది."

కొడుకుకి తువ్వాలు అందించి అడిగింది సావిత్రి.

"పద, వీపు ఎలా తుడుచుకుంటావో చూపించు."

చూసి, తృప్తిగా నిట్టూర్చి చెప్పింది "గుడ్"

"అమ్మా! తాతయ్య పేరేమిటన్నావ్?"

"దశరథరామయ్య."

రాజేష్ కాసేపు ఆలోచించి అడిగాడు.

"దశరథరామయ్య అంటే శ్రీరామచంద్రుడి తండ్రికదా?"

"అవును."

"మరి నాన్నగారి పేరో?"

రాజేష్ జుట్టుకి నూనె రాసుకుంటుంటే ఆమె మాతృ హృదయం కొట్టుకుపోయింది, ఆఖరిరోజు ఆ పనులన్నీ తను చేయాలని. రాజేష్ తల దువ్వుకుని తల్లిని అడిగాడు."ఎలావుంది?"

"గుడ్"

రాజేష్ మొహంలో వెన్నెల్లా చిరునవ్వు గర్వంగా తళుక్కుమంది, మళ్ళా 'గుడ్' పదం వినగానే.

"నాన్నగారి పేరు చెప్పలేదు" అడిగాడు.

కొడుకు క్రాఫ్‌ని సావిత్రి చేత్తో చెరిపేసింది.

"ఎందుకు చెరిపేసావమ్మా?" అడిగాడు రాజేష్ తల్లి మళ్ళీ తన తల దువ్వుతుంటే.

రాజేష్ మొహం కదలకుండా ఎడం చేతివేళ్ళతో, రెండు బుగ్గలని సున్నితంగా అదిమిపట్టి, కుడిచేత్తో జుట్టు దువ్వుతూ చెప్పింది సావిత్రి.

"నేను దువ్వుదామని. మీ నాన్నగారి పేరు సాంబశివరావు."

"సాంబశివరావా?"

తెల్లవారుఝామున అయిదున్నరకల్లా సావిత్రి కొడుకు తీసుకువెళ్ళే పెట్టెలో బట్టలు, పుస్తకాలు, చిన్న అద్దం, దువ్వెన మొదలయిన సామానంతా సర్దింది. ఆమె మనసులో లావాలా పొంగే విచారం కొడుకు కంటపడకూడదని సర్వవిధాలా ప్రయత్నిస్తోంది.

అయిదున్నరకల్లా సిద్ధం అయ్యారు.

"అమ్మా! టింకుని నాతో తీసుకెళ్ళనా?" అడిగాడు రాజేష్ అకస్మాత్తుగా.

"తీసుకెళ్తావా?"

"అవునమ్మా పాపం మనలాగా దానికెవరూ లేరుగా?"

"తీసుకెళ్ళు."

సావిత్రిని కౌగిలించుకుని రాజేష్ బావురుమన్నాడు.

"ఏమిటి? ఎందుకు?" సావిత్రి తనలోని దుఃఖాన్ని బయటకు రానీకుండా అతి బలవంతంగా నొక్కిపెట్టి అడిగింది.

"నాకు తాతయ్య దగ్గరకు వెళ్ళాలని లేదమ్మా."

"మరి ఇంతకాలం తాతయ్య దగ్గరకు ఎప్పుడు వెళదాం అని అడిగేవాడివిగా?"

"నువ్వు రాకుండా నేనొక్కడినే వెళ్ళాలని లేదు. నేను నీతోనే వస్తాను."

సావిత్రి చిన్నగా నిట్టూర్చింది. వాడి జుట్టుని చేతివ్రేళ్ళతో దువ్వుతూ చెప్పింది అనునయంగా.

"నేను కూడా వస్తున్నాను. కాకపోతే నువ్వు ముందు వెడ్తున్నావు. నేను కొద్దిరోజుల్లో వచ్చేస్తాను. అయినా పరాయివాళ్ళింటికి కాదుగా నువ్వు వెళ్ళేది. స్వయానా నీ తాతయ్య ఇంటికేగా. ఆయన నీకెన్నో కథలు చెబుతారు."

"పులి - సింహం కథలు వచ్చా తాతయ్యకి?"

"బోలెడు వచ్చు."

"కాకి పిచ్చుక కథలు."

"కుందేలు తాబేలు కథలు కూడా వచ్చు."

"అయినా వెళ్ళనమ్మా" చెప్పాడు రాజేష్ విచారంగా.

"ఇంక బయలుదేరదాం, రైలు టైమయింది."

రాజేష్ మొహంలో దిగులుని పసికట్టి చెప్పింది సావిత్రి.

"ఇంజను డ్రైవర్‌తో చెప్పి నిన్ను రైలు ఇంజన్‌లో కూర్చోబెట్టుకోమంటాను. ఎంచక్కా రైలింజన్‌లో వెళ్ళొచ్చు నువ్వు."

"మిగతావాళ్ళు?"

"రైలు పెట్టెల్లో."

"నేను?"

"రైలింజన్‌లో."

"రైలు కూత కూయాలంటే ఏ మీట నొక్కాలి?"

"రైలింజన్ డ్రయివర్నడిగితే చెప్తాడు. కూత కూయాల్సినప్పుడల్లా నువ్వు ఆ మీట నొక్కొచ్చు."

"నాకు ఏంటోగా ఉందమ్మా."

"కొత్తలో అలాగే ఉంటుందిరా కన్నా. అలవాటయితే దిగులుకూడా హాయిగా ఉంటుంది."

"ప్రామిస్."

కొడుకు చేతిలో చెయ్యివేసి, వాడి చెవిలో చెప్పింది సావిత్రి. "ప్రామిస్"

"మరి దిగులు అలవాటు అయ్యేదాకా ఏం చేయాలి?"

"ఏం చేయాలి?"

"నా కిష్టమయిన కవిత చదువుకోవాలి లేదా శ్రీరాముడ్ని ప్రార్థించాలి" చెప్పాడు రాజేష్.

"గుడ్ అలా చెయ్యాలి. ఇక బయలుదేరదామా? నడిచి వెళదామా? రిక్షాలో వెడదామా?"

"రిక్షాలో."

హనుమాన్ పేట నుంచి రిక్షా మాట్లాడింది సావిత్రి. చంకలో చిన్న అట్టపెట్టెతో జేష్ ఇంట్లోంచి బయటకు రాగానే, ఆ ఇంటి తలుపు తాళం వేసింది సావిత్రి. తలుపు మీద వున్న చిన్న బోర్డుమీద ఇచ్చట 'ట్యూషన్స్ చెప్పబడును' అన్న వాక్యం వ్రాసి ఉంది.

"మళ్ళీ మనింటికి ఎప్పుడు వస్తానో" చెప్పాడు రాజేష్ ఫిర్యాదు చేస్తున్నట్టుగా.

సావిత్రి ఆ మాట విన్నా విననట్లే మౌనంగా ఉండిపోయింది. విజయవాడ రైల్వే స్టేషన్ దగ్గర రిక్షా ఆగేదాకా ఇద్దరూ నిశ్శబ్దంగా వుండి పోయాఉర్. సెకండు క్లాసు టికెట్స్ అమ్మే కౌంటరు దగ్గరికి వెళ్ళారు.

"కన్నా నువ్వు తీసుకుంటావా టికెట్? క్యూ బాగా వుంది" చెప్పింది సావిత్రి రాజేష్ చేతిలో పదిరూపాయల నోటు వుంచి. "సగం టికెట్ మర్చిపోకు" హెచ్చరించింది.

కొన్ని క్షణాల తర్వాత గోల్కొండ ఎక్స్‌ప్రెస్ టికెట్ కౌంటర్ దగ్గర నిలబడ్డ ఆరున్నర అడుగుల పొడవుగల ఆ వ్యక్తికి వినపడింది. "ఏయ్ కొద్దిగా తప్పుకోండి" అని.

వెనక్కి తిరిగి చూశాడతను. ఆ మాటన్నవారు కనపడలేదు. మళ్ళీ ముందుకి తిరిగేసరికి, మునికాళ్ళమీద నుంచొని, అందీ అందని కౌంటర్లో చెయ్యి పెట్టి "సగం టికెట్ చాలు" అన్న రాజేష్ కనపడ్డాడు.

"ఎక్కడికి?" అడిగాడూ కౌంటర్‌లోని వ్యక్తి.

"సికింద్రాబాద్, మా తాతగారి ఊరికి."

"ఒక్కడివే వెళుతున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు కౌంటర్‌లోని వ్యక్తి.

"అవును. మా అమ్మ తరువాత వస్తుంది."

క్షణాల్లో రాజేష్ టికెట్, చిల్లర తీసుకుని తలయెత్తి ఆ పొడుగాటి వ్యక్తికున్న బుర్రమీసాలను చూసి, 'థాంక్స్ అంకుల్' అని హుందాగా వెళ్తున్న ఆ ఆరేళ్ళ కుర్రాడివంక కొరకొరా చూశాడు ఆ పొడుగాటి వ్యక్తి.

ఇద్దరూ స్టేషన్‌లోకి అడుగుపెట్టారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్ అప్పుడే గుంటూరునుంచి ప్లాట్‌ఫారం మీదకు వస్తోంది. సావిత్రి కళ్ళు అయిదో నెంబరు కంపార్టుమెంట్ కోసం వెతుకుతుండగా అడిగాడు రాజేష్.

"నన్ను రైలింజన్‌లో కూర్చోపెడతానన్నావుగా?"

"ముందర కంపార్టుమెంట్‌లో కూర్చో. నేను వెళ్ళి అడిగి వస్తాను. ఒప్పుకుంటే వెళ్ళి అక్కడ కూర్చోవచ్చు."

తన కొడుకు టిక్కెట్టు మీద సీట్ నెంబర్ చూసి, ఆ సీటులో రాజేష్‌ని కూర్చోపెట్టింది. పెట్టెని సీటుకిందకి తోసి చెప్పింది.

"సికింద్రాబాద్‌లో రైలు దిగేటప్పుడు ఈ పెట్టె మర్చిపోకు కన్నా."

"అలాగే."

చిన్న చేతిరుమాల మడతల్లో టిక్కెట్టు వుంచి, దాన్ని రాజేష్ నిక్కర్ జేబులో వుంచి చెప్పింది "టిక్కెట్ తనిఖీ చేయటానికి టి.సి వస్తాడు. అతనికి చూపించాలి దీన్ని."

"అలాగే."

"ఒక్కడే వెళుతున్నాడామ్మా...?" అడిగారు రాజేష్ ఎదురుగా కూర్చున్న ముసలి దంపతులలో ఒకరు.

"అవునండి. మీరు సికింద్రాబాద్ దాకా వెళుతుంటే అక్కడ కొంచెం సహాయం చేయండి" ప్రాధేయపూర్వకంగా చెప్పింది సావిత్రి.

"తప్పకుండా. నీ పేరేమిటి బాబు?" అడిగాడ ముసలాయన.

"కె. రాజేష్ కుమార్" చెప్పాడు రాజేష్.

"వరంగల్ స్టేషనుకి వెళ్ళేసరికి నీకు ఆకలేస్తుంది. అప్పుడు ఈ మినపరొట్టె తిని, మంచినీళ్ళు తాగు" చెప్పింది సావిత్రి, అవి వున్న సంచిని కొక్కానికి తగిలిస్తూ.

రాజేష్ తల ఊపాడు.

మడిచిన ఓ కాగితం రాజేష్ చొక్కా జేబులో వుంచి చెప్పింది సావిత్రి.

"ఇందులో మీ తాతయ్య అడ్రస్ వుంది. సికింద్రాబాద్‌లో దిగాక ఎవరికయినా ఆ కాగితం చూపించు. ఎలా వెళ్ళాలో చెప్తారు. నేను ముందే ఉత్తరం రాసాను. మేరీ ఆంటీ స్టేషనుకు వస్తుంది. ఒకవేళ రాకపోతే మాత్రం జాగ్రత్త."

మళ్ళీ తల ఊపాడు రాజేష్. సావిత్రి ఆ కాగితం జేబులోంచి జారిపోకుండా జేబుకీ కాగితానికి కలిపి పిన్నీసు పెట్టింది.

"నువ్వు త్వరగా వచ్చేస్తావుగా అమ్మా?" అడిగాడు రాజేష్.

"త్వరగానే వచ్చేస్తాను" సావిత్రి కొడుకు తల నిమురుతూ చెప్పింది.

"అమ్మా, తాతయ్య పేరేమిటన్నావ్?" అడిగాడు రాజేష్.

"దశరథరామయ్య."

"తాతయ్యకి మీసాలుంటాయామ్మా?" కొద్దిగా ఉత్సాహంగా అడిగాడు.

"ఉంటాయి."

"నాన్నగారి పేరు?"

కొన్ని క్షణాలు సావిత్రి మనసునిండా బాధ. నెమ్మదిగా చెప్పింది. "సాంబశివరావు."

"ఎప్పుడు బయలుదేరుతుందమ్మా?"

"బయలుదేరుతుంది. అయిదు నిమిషాలే యింక."

చెప్పాడు ఎదురుగా కూర్చున్న యువకుడు. అతను రాజేష్, సావిత్రిల మధ్య సంభాషణని ఆసక్తిగా వింటున్నాడు.

రాజేష్ కొన్ని క్షణాల్లో ఏడవబోతున్నాడని గ్రహించింది సావిత్రి. లేచి తన కుడిచేతి చిటికెన వేలు చూపించి బాత్‌రూంలోకి పరిగెత్తాడు రాజేష్. రెండు నిమిషాలు చూసి, లేచి బాత్‌రూం దగ్గరకి వెళ్ళి తలుపు ముందు ఆగింది. లోపలనుంచి వెక్కిళ్ళు వినబడుతున్నాయి. తలుపుమీద మృదువుగా తట్టింది.

"రాజేష్.. కన్నా.. తలుపు తెరు" చెప్పింది. తలుపు తెరుచుకుంది. సావిత్రి లోపలకు అడుగు వేసింది. తలుపు మూసి మోకాళ్ళమీద కూర్చుని కొడుకుని గుండెకు హత్తుకుని ఆపుకుంటున్న తన దుఃఖానికి ఆనకట్ట వేయలేకపోయింది. ఆ క్షణంలో దుఃఖం ఇద్దరినీ మరింత దగ్గర చేసింది. ఈసారి రాజేష్ ముందుగా తేరుకున్నాడు. ఏడుపుని బిగబట్టి, మింగి చెప్పాడు '

"నాకిష్టం. నాకిష్టం, ఇవి నాకిష్టం.

పులి పిల్ల చిన్న మీసం.

ఏనుగు పిల్లతో సావాసం

గిరగిర తిరిగే ఎర్ర బొంగరం

ప్రత్యూషలో అగుపించే అంబరం

నాకిష్టం. నాకిష్టం. ఇవి నా కిష్టం."

సావిత్రకూడా కొడుకుతో గొంతు కలిపి చెప్పసాగింది. తరువాత చరణాలు దుఃఖాన్ని ఆపుకుంటూ.

"నాకిష్టం. నా కిష్టం. ఇవి నాకిష్టం.

పచ్చటి అడవిలో తిరిగే కుందేలు

చల్లటి నీటిలో ఈదే తాబేలు

నెమలి పింఛం వున్న కృష్ణుని కిరిటం

వద్దన్నా ఆగక పడిలేచే కెరటం."

ఇద్దరూ ఒకరి కళ్ళు మరొకరు తుడుచుకుని, ఒకరి కళ్ళల్లోకి మరొకరు నవ్వుతూ చూస్తూ, మబ్బుల మాటున చంద్రుని గుర్తుతెచ్చేలా చిరునవ్వు నవ్వుతూ ఆ చరణాలను మళ్ళీ కలిసి చెప్పసాగారు.

"నా కిష్టం నాకిష్టం ఇవి నాకిష్టం.

పులి పిల్ల చిన్న మీసం

ఏనుగు పిల్లతో సావాసం.."

ఇద్దరూ చేతులు పట్టుకుని మళ్ళీ కంపార్టుమెంట్‌లోకి వచ్చారు. కొద్దిగా తేలికపడ్డాయి ఇద్దరి హృదయాలూ.

"మీరు దిగండి. బయలుదేరుతుంది" చెప్పింది ముసలావిడ సావిత్రితో.

"టింకూకి భోజనం పెట్టం మర్చిపోకు" హెచ్చరించింది దిగబోయేముందు.

రైలు కదిలేదాకా కిటికీ దగ్గరే నిలబడింది సావిత్రి. చాలాకాలానికి సరిపడేంత ప్రేమకావాలి అన్నట్లుగా రాజేష్ తల్లి చేతిని తన చేత్తో పట్టుకునే ఉన్నాడు, విడిపోయే నిమిషాలు దగ్గరయ్యేకొద్దీ.

గార్డు విజిల్ వేశాడు. నెమ్మదిగా రైలు చిన్న కుదుపుతో బయల్దేరింది. కదిలే రైలుతోపాటు అడుగులు వేసింది సావిత్రి.

"కన్నా నే చెప్పినదేం మర్చిపోకు. అక్కడ ఎవరికీ యిబ్బంది కలిగేలా ప్రవర్తించకు. దిగులేస్తే నే చెప్పిన కవిత చదువుకో, ఇందాకటిలా ఇక ఏడవకూడదు. ఐనా ఏడుపు వస్తే శ్రీరామచంద్రమూర్తిని తలచుకో, తాతయ్యని టెలిగ్రాం యివ్వమను, నువ్వు చేరినట్లుగా.."

"అమ్మా! నన్ను ఆఖరుసారిగా ముద్దుపెట్టుకో" అడిగాడు రాజేష్ కన్నీళ్ళతో స్నానం చేస్తున్న చిరునవ్వుతో.

రైలు వేగం ఎక్కువయి రాజేష్ కోరిక తీరలేదు. తన చేతిని విడవకుండా బలంగా పట్టుకున్న రాజేష్ చేతిలోంచి సావిత్రి సాధ్యమయినంత మృదువుగా తన చేతిని విడిపించుకుంది ఎంతో ఎంతో అయిష్టంగా. రైలు వేగాన్ని అందుకోలేక ప్లాట్ ఫారం మీద ఆగిపోయింది. రాజేష్ కనబడక పోయినా, ఆ పసివాడిని తీసుకెళ్ళే రైలు కనబడేంతవరకూ చూస్తుండిపోయింది. అది కనుమరుగయ్యాక నిస్పత్తువుగా, నిస్తేజంగా వెనక్కి తిరిగింది.

ఇక జీవితంలో మళ్ళీ తనకన్నాని చూస్తాననే నమ్మకం లేదు. సావిత్రిలో. వాడు పుట్టడానికి ముందు వచ్చిన పురిటి నొప్పులకు మించిన బాధ సన్నగా, క్రూరంగా తొలిచేస్తోంది ఆమె మనసుని. ఇక నడవలేక స్థంభానికి చేతులు కప్పుకుని, వెక్కి వెక్కి ఏడవసాగింది.

ఆమె పక్కనించి వెళ్ళే అయిదారుగురు ఏడుస్తూ ఉచ్చరించే మాటలు విన్నారు. కానీ ఏడుపు మిళితం అవటంవల్ల అవి అస్పష్టంగా విన్నారు. కాస్త జాగ్రత్తగా వినుంటే అర్థమయి ఉండేవి.

"నాకిష్టం, నాకిష్టం, ఇది నా కిష్టం.
వేసవికాలం దాటాక తొలిజల్లు
విచారాన్ని తుడిచే కన్నీళ్ళు
ప్రియుడి విరహంలోని బాధలో
కొద్దిపాటి తియ్యదనం కలిసి ఉంటుంది
కాని, తనయుడి విరహంలోని బాధలో
కేవలం బాధే ఉంటుంది."

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in